సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న గాంధీ

శేరిలింగంపల్లి: మెరుగైన వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ సహాయపడుతుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీకి చెందిన చెందిన చల్లా అవినాష్‌రెడ్డికి రూ.2.50 లక్షలు, చల్లా గీత జయరాణికి రూ.2 లక్షల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, పురేందర్ రెడ్డి, నాని తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనతో అవగాహన

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో ఇందిరా మహిళాశక్తి సంబరాలను తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన జిన్నారం, దాదిగూడెం గ్రామాల్లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మహిళల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను, స్వశక్తితో ఎదుగుదలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను కళా ప్రదర్శన ద్వారా పొదుపు సంఘాల మహిళలకు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం నరేందర్, సీసీలు జేజీ, భారతి, సుజాత, వీఓఏ నిర్మల, కళాకారులు దుర్గేష్, వినేష్, నవీన్, సంధ్య, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: వేమనకాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల గంటల వరకు కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ రోడ్డు నంబర్ 2,4,6,8 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- సీబీఆర్ ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 వరకు సీబీఆర్ ఎస్టేట్స్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, ఆంధ్రాబ్యాంక్ దగ్గర, క్రోమ భవనం వెనకాల ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : గోకరాజు రంగరాజు, ప్రశాంత్ నగర్, మయూరినగర్, బృందావన్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గోకరాజు కళాశాల రోడ్డు, ఆర్‌ఎల్ సిటీ, విజ్ఞాన్ కళాశాల, ఓల్డేజ్ హోమ్, వెంకటరాయనగర్, బాలాజీఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, ఇందిరమ్మ ఫేజ్-1, 2, ఆర్‌ఎల్‌సిటీ రోడ్డు, ఏఆర్‌కే టవర్స్, ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు, మయూరినగర్, ఓల్డేజ్ హోమ్, హైదర్‌నగర్ విలేజ్, నిజాంపేట మెయిన్ రోడ్డు, అదేవిధంగా మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు సద్గురు అపార్ట్‌మెంట్స్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఏరియా, బృందావన్ కాలనీ, హైదర్‌నగర్, మయూరినగర్ పార్ట్, ఓల్డేజ్ హోమ్, మయూరినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మదీనాగూడలో..

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎఫ్‌సిఐ కాలనీ, వీడిఐ కాలనీ, పీఏనగర్, చిరంజీవినగర్, అమాన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

డిజైన్‌కే పరిమితమైన మహిళా థీమ్ పార్కు

ప్రభుత్వం మారడంతో అటకెక్కిన ఫైల్

రాయదుర్గం: మహిళల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేయాలని తలపెట్టిన ప్రతిపాదన అలాగే మిగిలిపోయింది. గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓ కాలనీలో «మహిళా థీమ్ పార్కు» ఏర్పాటు చేయాలని ఐదేళ్ల క్రితం సంకల్పించారు. అందుకోసం అందంగా డిజైన్లను కూడా రూపొందించారు. ప్రభుత్వం మారిపోవడంతో డిజైన్ ఫైలుకే పరిమితం అయింది. థీమ్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ప్రతిపాదించిన సౌకర్యాలు..

- మహిళా థీమ్ పార్కును ఆధునికత ఉట్టిపడేలా.. ప్రవేశ ద్వారాన్ని ఆకర్షణీయంగా.. అలాగే మహిళా మూర్తి శిల్పాన్ని ఆకట్టుకునేలా రూపొందించాలని భావించారు.
- పార్కు మొత్తం పూలు, పచ్చదనంతో ఆకట్టుకునేలా గ్రీనరీ.. రాత్రిపూట లైటింగ్ సిస్టం
- వాకింగ్ ట్రాక్, ,చిన్నారుల ఆట స్థలం, సీనియర్ సిటిజన్స్ ఓపెన్ జిమ్, టీనేజర్స్ జోన్‌ను, హాబీజోన్, పాత్ వేలు, సెన్సారీ గార్డెన్, ఆరొమాటిక్ గార్డెన్, మిలేనియల్ జోన్, ఫిష్ స్పా(రిలాక్సేషన్ జోన్), ఫొటో జోన్, వ్యూపాయింట్, లేడీస్ ఓపెన్ జిమ్, అడ్వెంచర్‌జోన్



టీఎన్‌జీఓకాలనీలో ప్రతిపాదించిన మహిళా థీమ్ పార్కు డిజైన్ ఇదే

- సైకిల్ జోన్, సైకిల్ ట్రాక్, సైకిల్ పార్కింగ్ స్థలం ను అంతటా ఏర్పాటు చేసేలా
- టెర్రస్ గార్డెన్, బాల్కనీ గార్డెన్ డెమో ఏరియా, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వాలీబాల్ కోర్టు, లేడీస్ ప్లే ఏరియా, లేడీస్ పార్టీ ఏరియా, బ్యాడ్మింటన్ కోర్టు, సెక్యూరిటీ రూమ్, కిచెన్, కేఫ్, టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని తలపెట్టినా అది కార్యరూపం దాల్చలేదు.

గీతా పారాయణం.. గోరింటాకు పండగ



చందానగర్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ మహిళ మోర్చా సమక్షంలో గీతా పారాయణం, మహిళలకు ఆషాఢమాసం గోరింటాకు సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, రాష్ట్ర నాయకులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్‌లు హాజరై మాట్లా డుతూ భగవద్గీత జీవనసారం అని అన్నారు. ఇక గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో వక్తలు మోహన్‌రావు, మహేశ్వర్, వేముల వేణుగోపాల్, మహిళా నాయకురాలు పద్మా, మేరీ, పార్వతి, నిర్మల, వినయ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు : డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, సిటీ బ్యూరో: మెదడులోని కణితులు, ఇతర ఇంట్రాక్రేనియల్ సమస్యలను అత్యంత ఖచ్చితత్వం, భద్రతతో కూడిన నాన్ ఇన్వాసివ్ చికిత్స అందించడంలో జాప్-ఎక్స్ గైరోస్కోపిక్ రేడియో సర్జరీ అద్భుత ఫలితాలిస్తుందని ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో జాప్-ఎక్స్ రేడియో సర్జరీ విభాగాన్ని ప్రారంభించారు. రోగుల అవసరాలు, సౌకర్యం, ఆరోగ్య సంరక్షణ అంశాలను దృష్టిలో పెట్టుకుని అధునాతన సాంకేతికతతో కూడిన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి న్యూరోసర్జికల్ కేర్ కోసం రోగులు విదేశాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. జాప్-ఎక్స్ గైరోస్కోపిక్ డ్యూయల్ గింబల్డ్ 360 డిగ్రీల చికిత్సా వర్క్‌స్పేస్‌ను అందిస్తుందన్నారు. మెదడులోని కణజాలం దెబ్బతనకుండా రేడియేషన్‌ను అందిస్తుందని తెలిపారు.

చాతుర్మాస దీక్షలో భాగస్వాములవ్వాలి

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి



దీక్షను ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి

చందానగర్ : పవిత్ర చాతుర్మాస దీక్షలో భక్తులు భాగస్వాములవ్వాలని శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పిలుపునిచ్చారు. విశ్వంలో భరతభూమి అతి పవిత్రమైందన్నారు. గురువారం చందానగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలో చాతుర్మాస దీక్ష ప్రారంభించారు. గోమాతకు పూజ చేసి గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహాస్వామి వారికి పాదుకాపూజ, భిక్షా వందనం నిర్వహించి, గురువందనం సమర్పించారు. తదితానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీ శారదా స్వరూప రాజశ్యామల చంద్రమౌళీశ్వరరాధన తీర్థ గోష్ఠి జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు సాయి, ఆలయ కమిటి అధ్యక్షులు రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



కొత్తగూడలో.. బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా



బీహెచ్‌ఈఎల్ బీవీబీలో..పరమానందప్రభు, ప్రిన్సిపల్ ఉమాశాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ శ్రీవాణి, భాను



గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో పూర్ణాహుతి



చందానగర్ హుడాకాలనీ ఫేజ్-2లో.. పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, నిర్వాహకులు



కొత్తగూడలోని సాయిబాబా ఆలయంలో..

కిటకిటలాడిన షిర్డీ సాయిబాబా ఆలయం

శేరిలింగంపల్లి జోన్ బృందం: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులతో ఆలయా లు కిటకిటలాడాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు,బస్తీలలో వెలసిన సాయిబాబా ఆలయాలలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఉత్తరాధికారి, అర్చకుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.
- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో గణపతి, రుద్ర, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు.

పాఠశాలలో గురువందనం



గురువు వీరమణిని సన్మానిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: భారత్ వికాస్ పరిషత్ నమో గంగా ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శేరిలింగంపల్లి హైస్కూల్‌లో విద్యనభ్యసించిన సోషల్ టీచర్ వీరమణికి గురువందనం చేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వీరమణి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో గురువు పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు ఎల్. నర్సింహారెడ్డి, నమో గంగా అధ్యక్షులు భవానీ ప్రసాద్, కార్యదర్శి లక్ష్మణ్, తెలంగాణ ప్రాంత ప్రముఖ్ నివేదిత, ప్రతినిధులు ప్రత్యూష, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకంబరిగా అన్నపూర్ణాదేవి



రాయదుర్గం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. 150 కిలోల కూరగాయలు ,ఆకుకూరలు, పండ్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ మేనేజింగ్‌ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?



ప్రశాంతినగర్ కాలనీ రోడ్డు

మణికొండ: కోట్లాది రూపాయల ఆదాయం ఉన్న మణికొండ లాంటి మున్సిపాలిటీలో రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతలరోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా ఉందని పలువురు వాపోతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అనేక రోడ్లల్లో గోతులు ఏర్పడడం, వాటిని తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలవుతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి కనిపించక ప్రమాదాల బారిన పడతారని వారు పేర్కొంటున్నారు. కొన్ని కాలనీల్లో నీటి ట్యాంకర్లు, రెడీమిక్స్ వాహనాలు వందలాదిగా తిరగడం, రోడ్లపై నీరు పడి గుంతల మయంగా మారుతున్నాయని తెలిపారు. వాటిని కట్టడి చేయక, ఇటు రోడ్లపై ఏర్పడిన గోతులను సకాలంలో పూడ్చకపోవటంతో ప్రాణాలరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్, తుల్జారాం ఆలయం పక్క నుంచి నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి వెళ్లే రోడ్లు పూర్తి స్థాయిలో గుంతలమయంగా తయారయ్యా యని ప్రయాణికులు తెలిపారు. స్కూళ్లకు వెళ్లి వచ్చే విద్యార్థులు, వారిని తీసుకుని వచ్చే తల్లిదండ్రులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.గచ్చిబౌలిలోని ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్‌లోని పోచమ్మ కుంటలో గుర్తు తెలియని వ్యక్తి (30- 40) మృతదేహం తేలియాడుతోందని గురువారం ఉదయం 8.30 గంటలకు సెక్యూరిటీ ఇంచార్జీ జి.సురేష్ గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఎడమ చేతిపై డాడీ, డ్రాగన్, కుడి చేతిపై ఆర్, ఎస్‌కె తో పాటు ఫ్యామిలీ బొమ్మ పచ్చబొట్లు ఉన్నాయి. మూడు రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఉంటే గచ్చిబౌలి పీఎస్‌లో, 9490617127 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో యాదవ సంఘం ఫంక్షన్ హాల్ ప్రారంభం



కల్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన యాదవ సంఘం కల్యాణ మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం గోకుల్‌నగర్‌లో నిర్మిస్తున్న కల్యాణ మండపాన్ని ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కల్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు దేవయ్య యాదవ్, మేకల వెంకటేష్, శ్రీశైలం యాదవ్, మల్లేష్ యాదవ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్‌లో గల సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గోపాల్, లక్ష్మణ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు



అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఎమ్మెల్యేతో విద్యార్థులు, అంగన్‌వాడి సిబ్బంది

జిన్నారం (పటాన్‌చెరు): ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం జిన్నారం మండలంలోని కొడకంచిలో సీసీ రోడ్ల శంకుస్థాపన, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని తాబేలుగుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ ఆలయ పనులను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్ ఛైర్మన్ ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఆనంద్, శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సురేష్, మాజీ సర్పంచ్ శివరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు సమస్య



విశ్వేశ్వరయ్య కాలనీలో రోడ్డుపై మురుగు

మియాపూర్ : మియాపూర్ విశ్వేశ్వరయ్య కాలనీలో రోడ్డుపై మురుగు ప్రవాహంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 10 నెలలు గడుస్తున్నా కాలనీలో మురుగు సమస్య పరిష్కరించడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ నామమాత్రంగా చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రెడీమిక్స్ లారీ ఢీకొని యువకుడు మృతి



చందానగర్ : రెడీమిక్స్ లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. ఖమ్మం జిల్లా కల్లూర్ మండలం రాళ్ళబహుజర గ్రామానికి చెందిన గుర్రం వెంకట రామారావు (29) నల్లగండ్లలో హాస్టల్‌లో ఉంటున్నాడు. మదీనాగూడ ఈంపల్స్ కాలేజీ ప్రిన్సిపల్ వద్ద కార్ డ్రైవర్‌గా కుదిరాడు. అయితే గురువారం మదీనాగూడ నుంచి లింగంపల్లి మీదుగా తెల్లాపూర్‌కు రాపిడో బైక్ బుక్ చేసుకొని వెళ్తున్నాడు. నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్దకు రాగానే రెడీమిక్స్ లారీ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ వెనకాల కూర్చున్న గుర్రం వెంకట రామారావు కింద పడడంతో లారీ అతనిపై నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బైక్ డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 8 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.